సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 16 । మార్చి । 2025



బస్‌షెల్టర్లు లేక అవస్థలు

ఉట్నూర్ ఆర్టీసీ డిపో పరిధిలోని ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

9లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:22	సోమ : 5:07

గరిష్టం/కనిష్టం 40.0/29.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

న్యూస్‌రీల్

అన్నదాతకు అండగా ప్రభుత్వం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భోజారెడ్డి

తాంసి: రైతులు సాగు చేస్తున్న ప్రతీ పంటను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తూ వారికి అండగా నిలుస్తుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పంట దిగుబడులను విక్రయించుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సీఈవో కేశవ్, ఏవో రవీందర్, రైతులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి శనివారం కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. తాంసి ఎంపీడీవో కార్యాలయంలో 35 మందికి, భీంపూర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో 57 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు లక్ష్మి, నలందప్రియ, ఎంపీడీవోలు మోహన్ రెడ్డి, గోపాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ పనులు నిలిపివేయాలి



పిల్లలతో కలిసి ధర్నా చేస్తున్న మహిళలు

కైలాస్‌నగర్: అనుమతుల్లేకుండా చేపట్టిన సెల్‌టవర్ నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని పట్టణంలోని న్యూహౌసింగ్‌బోర్డు పరిధిలోని జూబ్లీహిల్స్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. శనివారం టవర్ నిర్మిస్తున్న ప్రాంతంలో పిల్లలతో కలిసి మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, టవర్ నిర్మాణంతో ఆరోగ్యపరంగా తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతాయన్నారు. పనులు వెంటనే నిలిపివేయాలని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. పనులు ఆపేంతవరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

ముగిసిన టెండర్ల గడువు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గల స్విమ్మింగ్‌పూల్ నిర్వహణకు సంబంధించి టెండర్ల స్వీకరణ గడువు శనివారంతో ముగిసింది. మున్సిపల్ అధికారులు ఈ టెండర్లను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లోనూ ఆహ్వానించారు. మొత్తం ఆరు దాఖలైనట్లుగా బల్దియా ఇంజినీర్ పేరిరాజు తెలిపారు. ఈ నెల 20న టెండర్లను తెరిచి ఎక్కువ బిడ్ కోట్ చేసిన వారికి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: నిరుద్యోగ బీసీ యువతకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో అందించనున్న ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ 38 రోజుల పాటు ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం అర్హత కలిగిన వారికి సంబంధిత రవాణా సంస్థ పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎల్‌ఎంవీ శిక్షణకు 18 – 45ఏళ్ల లోపు వారు, హెచ్‌ఎంవీ శిక్షణకు 20- 45ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. అలాగే 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 31లోపు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎయిర్‌పోర్టు తెస్తా.. ఆ బాధ్యత నాది

జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్టు ఆవశ్యకత, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు తదితర అంశాలను ప్రస్తావిస్తూ 'సాక్షి' ఇటీవల ఈ ప్రాంతవాసుల మనోభావాలను ప్రతిబింబించేలా చొరవ చూపింది. ఈ నెల 6న 'రెక్కలపై ఆశలు' శీర్షికన చర్చావేదికతో పాటు ఈ నెల 9న 'మామ.. ఎయిర్‌పోర్టొస్తే.. మనకేమస్తది' శీర్షికన ప్రత్యేక కథనాలను ప్రచురించింది. ఈ క్రమంలో తాజాగా అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి ఈ అంశంపై ఈ ప్రాంతవాసులకు భరోసా ఇచ్చేలా చేసిన వ్యాఖ్యలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి.

– కైలాస్‌నగర్

- వరంగల్‌కు తెచ్చింది నేనే.. ఆదిలాబాద్‌కూ సాధిస్తా
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి
- జిల్లాలో చర్చనీయాంశమైన 'సాక్షి' కథనాలు

'ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు తెస్తా.. ఆ బాధ్యత నాది.. ఆ మంచి పేరు కూడా నేనే తీసుకుంటా.. మొదటి విడతలో వరంగల్‌కు తెచ్చా.. రెండో విడతలో ఆదిలాబాద్‌కు తీసుకొస్తా.. తెలంగాణ వచ్చిన తర్వాత కొత్త ఎయిర్‌పోర్టుల కోసం ఎలాంటి ప్రయత్నం జరగలేదు.. అదే పక్క రాష్ట్రాలను చూడండి.. ఎన్ని ఉన్నాయి.. మన దగ్గర కూడా పెంచేందుకు కృషి చేస్తున్నా.. పెండింగ్ ప్రాజెక్టులను సాధించేందుకే ఢిల్లీ వెళుతున్నా.. కేంద్ర మంత్రులను కలుస్తున్నా.. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి కేంద్రంలో ఉన్నవారితో ఇక్కడి బీజేపీ నేతలకు ఉన్న సంబంధాలను ఉపయోగించుకుందాం.. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో మాకు ఎలాంటి భేషజాలు లేవు' ఇది సీఎం రేవంత్‌రెడ్డి శనివారం శాసనసభలో అన్న మాటలు.





ఈనెల 6న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం



ఈనెల 9న 'సాక్షి'లో సండే స్పెషల్ స్టోరీ

రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. గవర్నర్ ప్రసంగానికి సంబంధించి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం శాసనసభలో చర్చ సాగింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్.. ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి చర్చ లేవనెత్తారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి చొరవ లేకపోవడంతో ఆదిలాబాద్ విషయంలో ముందడుగు పడటం లేదని పేర్కొన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో పాటు పరిశ్రమల అభివృద్ధికి అనేక అవకాశాలున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతవాసుల మనోభావాలకు అనుగుణంగా కీలక వ్యాఖ్యలు చేశారు.

'సాక్షి' ప్రత్యేక చొరవ..

కేంద్ర ప్రభుత్వం ఇటీవల వరంగల్‌లోని మామూనూరులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌కు ఎయిర్‌పోర్టు తానే తీసుకొచ్చానని చెప్పుకోవడం, ఆ తర్వాత హైదరాబాద్‌లో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి దేశంలో కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేసే విషయంలో మోదీ సర్కారు చొరవ చూపుతుందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్‌లోని జక్రాన్‌పల్లిలో కూడా ఏర్పాటు చేసే విషయంలో ముందుంటామని స్పష్టం చేశారు. అయితే ఆదిలాబాద్ అంశాన్ని ప్రస్తావించకపోవడంతో ఈ ప్రాంతవాసుల్లో నిరాశ వ్యక్తమైంది. ప్రధానంగా ఇక్కడ మౌలిక వసతులు అందుబాటులో ఉండడం, దశాబ్దాలుగా విమానాశ్రయం ఏర్పాటు డిమాండ్ ఉన్నా విస్మరించడంపై ఒకింత నారాజ్ అయ్యారు. ఈ క్రమంలో 'సాక్షి' సామాజిక బాధ్యతగా చొరవ తీసుకుంది. ఈ నెల 5న జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో 'ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు సాధన కోసం' చర్చా వేదిక నిర్వహించింది. కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. పట్టణానికి చెందిన మేధావులు, ప్రముఖులు పాల్గొని ఆదిలాబాద్‌కు విమానాశ్రయం ఇవ్వాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఎయిర్‌పోర్టు సాధన కోసం అప్పటికప్పుడే అడహక్ కమిటీని సైతం ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో రాజకీయాలకతీతంగా ఐక్య ఉద్యమానికి సిద్ధమని ప్రకటించడంతో స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరిగింది. అదే రోజు ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎయిర్‌పోర్టు సాధన కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఈ ప్రాంతానికి విమానాశ్రయం వస్తే కలిగే ప్రయోజనాలు.. అందుబాటులో ఉన్న వనరులు.. తదితర అంశాలను ప్రస్తావిస్తూ 'సాక్షి' ఈనెల 9న తెలంగాణ యాసలో సండే స్పెషల్‌గా 'మామ.. ఎయిర్‌పోర్టొస్తే మనకేమస్తది' శీర్షికన మరో కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలో తాజాగా అసెంబ్లీలో ఎమ్మెల్యే శంకర్ ఈ విషయాన్ని ప్రస్తావించగా సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించడం జిల్లాలో సర్వత్రా చర్చనీయాంశమైంది.

కేంద్రం పాజిటివ్‌గా ఉంది



ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసే అంశంలో కేంద్రం పాజిటివ్‌గా ఉంది. రాష్ట్రం నుంచి గతంలో బీఆర్‌ఎస్ సర్కారు సహకరించకపోవడంతో అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి సాధన విషయంలోనే మేము ప్రధానమంత్రితో పాటు కేంద్ర మంత్రులను తరచూ కలుస్తున్నాం. అందుకే అసెంబ్లీలో ఈ విషయాన్ని నేను ప్రస్తావించాను. ముఖ్యమంత్రి పాజిటివ్‌గా స్పందించారు. నేను అనేది ఒకటే..' పేరు మీకొచ్చినా .. మా ఆదిలాబాద్‌కు మాత్రం ఎయిర్‌పోర్టు కావాలి.. అనేదే మా నినాదం'.

– పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

సరిహద్దులో నిఘా పెంచాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

తాంసి: ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్రను ఆనుకుని ఉన్నందున అక్రమ రవాణాను అరికట్టేందుకు సరిహద్దులో నిఘా పెంచాలని ఎస్పీ అఖి ల్ మహాజన్ అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆవరణలో మొక్క నాటారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కె.ఫణిందర్, ఎస్సై రాధిక, ఉన్నారు. తొలిసారిగా గ్రామానికి విచ్చేసిన ఎస్పీని గ్రామస్తులు సన్మానించారు.

తలమడుగు పోలీస్‌స్టేషన్ తనిఖీ..

తలమడుగు: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఆయన వెంట ఎస్సై అంజమ్మ, సిబ్బంది ఉన్నారు.

ఏప్రిల్ 20 నుంచి 'ఓపెన్' పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మ ధ్యాహ్న 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 26 నుంచి మే 3 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విషయాన్ని అభ్యాసకులు గమనించాలని సూచించారు.

గడువులోపు గగనమే!



ఆదిలాబాద్‌రూరల్ మండలం వాన్వాట్ గ్రామంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

- ఆర్థిక సంవత్సరం చివరన అభివృద్ధి పనులు
- జిల్లాకు 1,628 మంజూరు.. ప్రారంభమైనవి 529 మాత్రమే
- ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ సీసీ రోడ్ల పరిస్థితి

కైలాస్‌నగర్: 2024–25 ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 15 రోజులే గడువు ఉంది. ఇది వరకు మంజూరైన పనుల్లోనే సగానికి మించి ఇంకా షురూ కాలేదు. వాటిని ప్రారంభించేందుకే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తంటాలు పడుతున్నారు. మొదటి విడత పనులకే మోక్షం లేకపోగా జిల్లాకు తాజాగా రూ.26.26 కోట్లతో కూడిన మరో 853సీసీరోడ్లు మంజూరయ్యాయి. సమయం తక్కువగా ఉండటం, పెద్దసంఖ్యలో మంజూ రు కావడంతో గడువులోపు పూర్తవుతాయా, అసలు ప్రారంభానికి నోచుకుంటాయా అనేది ప్రశ్నార్థకం. అయితే జిల్లాకు వచ్చిన నిధులను వందశాతం సద్వినియోగం చేసుకోవాలని సంకల్పించిన అధికారులు వాటిని గడువులోగా పూర్తిచేసేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. హడావుడిగా చేపడుతున్న పనులతో నాణ్యత కొరవడుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి

1,099 పనులు ప్రారంభం కాలే..

మొదటి, రెండో విడతలో కలిపి ఆదిలాబాద్ జిల్లాకు ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 66.41 కోట్ల వ్యయంతో కూడిన 1,628 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు కేవలం 529 పనులను ప్రారంభించగా, ఇందులో 132 మాత్రమే పూర్తయ్యాయి. మరో 1,099 పనులు ప్రారంభించాల్సి ఉంది. మార్చి31తో ఆర్థికసంవత్సరం ముగియనుంది. మెజార్టీ పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోకపోగా ప్రారంభించిన పనులు సైతం పూర్తిచేయడం కష్టతరంగా మారింది. అయితే గడువులోపు పూర్తి చేసేందుకు పీఆర్, డీఆర్డీఏ అధికారులు కుస్తీ పడుతున్నారు.పీఆర్ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన 8 మంది ఉద్యోగులను నియమించారు. వారంతా పీఆర్ కార్యాలయంలోనే వారం పాటు ఇవే పనులు నిర్వహించేలా బాధ్యతలు అప్పగించారు. అయినప్పటికీ పూర్తి స్థాయిలో పనులు జరుగుతాయనేది సందేహంగానే కనిపిస్తోంది.

కరువైన పర్యవేక్షణ...

సీసీ రోడ్లను ఎలాగైనా గడువులోపు పూర్తిచేయాలనే దిశగా పనులు దక్కించుకున్న నాయకులు యత్నిస్తున్నారు. అయితే హడావుడిగా చేపడుతున్న పనుల్లో నాణ్యత కొరవడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అలాగే పనులను పర్యవేక్షించాల్సిన పీఆర్ ఇంజినీర్లు జిల్లాలో 17మందికి గాను తొమ్మిది మంది మాత్రమే ఉన్నారు. ఒక్కో ఏఈ రెండు మండలాలను పర్యవేక్షించాల్సి రావడంతో పనుల్లో నాణ్యత కొరవడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనులు పర్యవేక్షిస్తూ ఎంబీలు రికార్డు చేయాల్సిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

జిల్లాకు మంజూరైన మొత్తం పనుల వివరాలు..

నియోజకవర్గం	మంజూరైన పనులు
ఆదిలాబాద్	366
బోథ్	857
ఆసిఫాబాద్	242
ఖానాపూర్	163

రెండు రోజుల క్రితం మంజూరైన పనుల వివరాలు

నియోజకవర్గం	పనులు	నిధులు(రూ.కోట్లలో)
ఆదిలాబాద్	198	7.46
బోథ్	536	14.98
ఆసిఫాబాద్	97	3.03
ఖానాపూర్	22	1.08

సకాలంలో పూర్తిచేసే ప్రయత్నం

జిల్లాకు కేటాయించిన నిధులను వందశాతం సద్వినియోగం చేసుకునే దిశగా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. మంజూరు చేసిన ప నులన్నింటిని ప్రారంభించి గడువులోపు పూ ర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం డీఆర్డీఏ శాఖకు చెందిన ఎనిమిది మంది ఉద్యోగులను ప్రత్యేకంగా నియమించాం. వారికి ఎస్టిమేషన్ తయారీ పనులను అప్పగించాం. అలాగే ప్రతీ రోడ్డును నాణ్యతతో నిర్మించేలా దృష్టి సారిస్తున్నాం.

– రాథోడ్ శివరాం, పీఆర్, ఈఈ

దివ్యాంగులకు 'యూడీఐడీ'

- స్మార్ట్‌కార్డుల దరఖాస్తుకు ప్రత్యేకపోర్టల్
- కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాల లబ్ధికి దోహదం
- ఒకే కార్డుతో అనేక ప్రయోజనాలు



కై లాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలతో పాటు కేంద్ర పథకాలను పొందేందుకు వీలుగా దివ్యాంగులకు యూనిక్ డిజబిలిటి ఐడెంటిఫికేషన్ నంబర్ (యూడీఐడీ) స్మార్ట్ కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు వారి వైకల్య ధ్రువీకరణపత్రాన్ని సదరం శిబిరాల్లో కాగితం రూపంలో అందిస్తున్నారు. అందుకు నిర్ణీత కాల పరిమితి ఉంటుంది. కార్డు పునరుద్ధరణ, కొత్త కార్డుల జారీ కోసం దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఆధార్ తరహా ప్రత్యేక నంబర్‌తో కూడిన స్మార్ట్ కార్డులను జారీ చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందుకనుగుణంగా ఈ నెల 8న జిల్లాలోని దివ్యాంగుల ప్రతినిధులు, డీఆర్డీఏ, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి స్మార్ట్‌కార్డుల జారీపై దిశానిర్దేశం చేశారు.

దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక పోర్టల్

యూడీఐడీ కార్డులకు దరఖాస్తు చేసుకునేందు కోసం కేంద్ర ప్రభుత్వం http://www.swavlambancard.gov.in ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించింది. దీని ద్వారా దివ్యాంగులు నేరుగా ఆన్‌లైన్‌లో ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే మీసేవ కేంద్రాల్లోనూ అప్లై చేసుకోవచ్చు. దరఖాస్తులో అడిగిన వివరాలు నింపడంతో పాటు పాస్‌పోర్టుసైజ్ ఫొటో, సంతకం, ఆధార్‌ను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇలా దరఖాస్తు చేసుకోగానే ఎన్‌రోల్‌మెంట్ నంబర్ సెల్‌ఫోన్‌కు మేసేజ్ రూపంలో అందుతుంది. 31.10.2023 వరకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్లు కలిగిన వారందరికీ యూడీఐడీ స్మార్టు కార్డు, సర్టిఫికెట్లు ప్రభుత్వం జనరేట్ చేసి ఉంచింది. కొంతమందికి ఆ కార్డులను నేరుగా వారు సూచించిన చిరుమానాకు పోస్టల్ ద్వారా పంపించగా మరికొందరి కార్డులను జిల్లా సంక్షేమాధికారి కార్యాలయానికి పంపించింది. కార్డు రానటువంటి వారెవరైనా ఉంటే యుడీఐడీ పోర్టల్‌లో ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్ ద్వారా తెలుసుకునే వెసులుబాటును సైతం కల్పించింది.

జిల్లాలోని దివ్యాంగుల వివరాలు

కేటగిరీ	దివ్యాంగులు
ఆర్థోపెడిక్	6,535
దృష్టిలోపం	1,266
వినికిడి లోపం	1,315
మానసిక వైకల్యం	1,295

దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలోని దివ్యాంగులు కేంద్ర ప్రభుత్వం జారీ చేయనున్న యుడీఐడీ స్మార్ట్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు అవగాహన కల్పించేలా వీవోఏలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు పంచాయతీ కార్యదర్శులు విస్తృత ప్రచారం కల్పించాలి. సదరం సర్టిఫికెట్ కలిగిన వారికి కూడా ఈ స్మార్ట్‌కార్డులు నేరుగా వారి ఇంటి వద్దకే రానున్నాయి. ఏమైనా సందేహాలుంటే ఎంపీడీవో కార్యాలయాల్లో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు.

– రాథోడ్ రవీందర్, డీఆర్డీవో

స్మార్ట్‌కార్డులతో దేశవ్యాప్తంగా సేవలు

మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసిన సమయంలో సదరం శిబిరాన్ని నిర్వహించే కేంద్రాన్ని ఎంచుకోవాలి. ఆ కేంద్రంలో ఏ రోజు సదరం వైద్య శిబిరం నిర్వహిస్తారనేది సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో సమాచారాన్ని పంపుతారు. నిర్ణీత తేదీలో అక్కడికి వెళ్లి వైద్య పరీక్షలు చేసుకుంటే సంబంధిత వైద్య నిపుణులు వైకల్యాన్ని నిర్ధారించి వైకల్య శాతాన్ని యుడీఐడీ పోర్టల్‌లో నమోదు చేస్తారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితో పాటు ఇప్పటికే సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్న వారికి కూడా ఈ స్మార్ట్‌కార్డులను జారీ చేయనున్నారు. స్మార్ట్ కార్డుల కోసం మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే సదరం శిబిరానికి హాజరుకావాల్సి ఉంటుంది. దివ్యాంగులకు సంబంధించి వివరాలన్ని సక్రమమేనని వైద్యులు నిర్ధారించాకే స్మార్ట్‌కార్డు జనరేట్ అవుతుంది. డిజిటల్ సంతకంతో కూడిన స్మార్ట్‌కార్డును పోస్టల్ డిపార్టుమెంట్ ద్వారా నేరుగా దివ్యాంగుడి ఇంటి చిరునామాకే పంపించనున్నారు. తద్వారా పదేపదే ఆసుపత్రులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోనుంది. ఈ స్మార్ట్ కార్డులో ఐడీ నంబర్, దివ్యాంగుడి పేరు, వైకల్య రకం, వైకల్య శాతం వంటి సమగ్ర వివరాలుంటాయి. ఈ కార్డులతో రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలతో పాటు రైళ్లు, బస్సు టికెట్లపై రాయితీ, పింఛన్ వంటి ప్రయోజనాలను పొందవచ్చు. సదరం సర్టిఫికెట్‌తో రాష్ట్రంలోనే సేవలు పొందే అవకాశముండగా యూడీఐడీ కార్డుల ద్వారా దేశంలో ఎక్కడైనా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సేవలను పొందవచ్చు.

ఏఐతో నాణ్యమైన విద్యాబోధన

- కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) పరిజ్ఞానంతో విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యాబోధన అందుతుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని తాటిగూడ ప్రభుత్వ పాఠశాలలో ఎఫ్‌ఎల్‌ఎస్–ఏఎక్సల్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ ఎంతగానో దోహద పడుతుందన్నారు. స్టెప్ ఫౌండేషన్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా విద్యాబోధన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, హెచ్‌ఎం నారాయణ, శిక్షకుడు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో గల ఈవీఎంల గోడౌన్‌ను కలెక్టర్ రాజర్షి షా శనివారం పరిశీలించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. స్ట్రాంగ్ రూం సీల్ తీయించి అందులో భద్రపర్చిన ఈవీఎంల స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. అనంతరం యథావిధిగా సీల్ వేయించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించి జిల్లా ఓటర్లకు సంబంధించిన వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకునేలా చూడాలని కోరారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాథోడ్ పంచపూల తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులు సరైన సమయంలో మాత్రలు వేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: క్షయ వ్యాధిగ్రస్తులు సరైన సమయంలో మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. వంద రోజుల టీబీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంకోలి పీహెచ్‌సీలో టీబీ పెషెంట్స్‌కు నిక్షయ పోషణ్ కిట్స్‌ను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, గ్లాండ్‌ఫార్మా ప్రతినిధులు రఘురామన్, గిరీష్, సుబ్బరాజు, లోక భారతి ట్రస్టు ప్రతినిధి కుమారస్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు మనోహర్, సాధన, డీటీసీవో సుమలత, ఎన్‌సీడీ పీవో శ్రీధర్, డీఎల్‌వో గజానంద్, మండల వైద్యాధికారులు ఆశాకిరణ్, సర్ఫరాజ్, టీబీ ఎంవో సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా









కవ్వాల్.. విహంగాల విడిది

జన్నారం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్ వన్యప్రాణులకే కాకుండా పక్షులకు ఆవాసంగా మారింది. స్థానిక పక్షులకే కాకుండా విదేశీ పక్షులు కూడా ఇక్కడికి వస్తున్నాయి. జన్నారం అటవి డివిజన్‌లోని మైసమ్మకుంట, బైసన్‌కుంట, కల్పకుంట, ఘనిశెట్టికుంట ప్రాంతాలు పక్షులకు ఆవాసంగా మారాయి. విదేశీ పక్షులైన లెజర్ విజ్లింగ్ డక్స్, ఆసియన్ ఓపెన్ బిల్‌స్ట్రోక్, ఇండియన్ స్పాట్ బిల్డ్ డక్, హర్న్ బిల్‌తోపాటుగా ఇండియన్ పక్షులు ఇక్కడికి వస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన బర్డ్‌వాక్, పక్షుల సర్వేతో పక్షులపై ఈ ప్రాంత వాసులకు మక్కువ పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పక్షుల ఆవాసాలను మరింత అభివృద్ధి చేస్తామని రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు.

క్లుప్తంగా

జీవో 3ను పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సచిన్

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం జీవో 3ను పునరుద్ధరించి ఆదివాసీలకు ఉద్యోగాలు దక్కేలా చూడాలని టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. బెంగుళూర్‌లో నిర్వహిస్తున్న ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సమావేశాల్లో ఆయన రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొని మాట్లాడారు. జీవో 3ను పునరుద్ధరణ చేసే అధికారం, అవకాశం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందన్నారు. అయితే ఆ దిశగా ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలోనైనా కేంద్రం స్పందించి 5వ షెడ్యూల్‌లో ఆదివాసీ యువతకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మట్కా జూదరుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన నలుగురు మట్కా జూదరులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక గాంధీనగర్‌లో మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురి నుంచి రూ.3200 నగదుతో పాటు 17 మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నారు. ఇందిరానగర్‌కు చెందిన అబ్దుల్ ఫరీద్, భుక్తాపూర్‌కు చెందిన షేక్ అజీమ్, గాంధీనగర్‌కు చెందిన మారుతీ, చిల్కూరిలక్ష్మీనగర్‌కు చెందిన షేక్ అలీమ్‌ను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ కరుణకర్ రావు తెలిపారు. కాగా వీరిని ప్రోత్సహిస్తున్న మునీర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

పండిద్దాం పొగాకు..

- చెన్నూర్ చేలల్లో సాగు..
- పంట మార్పిడికి ముందుకు వస్తున్న రైతులు
- తక్కువ నీటి వసతి.. ఎక్కువ దిగుబడి
- పంటను ఆశించని తెగుళ్లు



శివలింగాపూర్ సమీపంలో తోరణాలుగా ఆరబెట్టిన పొగాకు



అక్కెపల్లి సమీపంలో సాగవుతున్న పొగాకు పంట

చెన్నూర్‌రూరల్: ఎప్పుడూ ఒకే రకం పంటల సాగుతో భూమిలో సారం దెబ్బతింటుంది. పంట మార్పిడి విధానం పాటించాలని వ్యవసాయాధికారులు కూడా తరచూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే చాలా మంది రైతులు దీనిని పట్టించుకోరు. కానీ, చెన్నూరు మండలంలో కొందరు రైతులు అధికారుల సూచనలతో పంట మార్పిడి విధానంతో లాభాలు గడిస్తున్నారు. మిర్చి పంట సాగు చేసి పురుగు ఆశించడం, సరైన దిగుబడి రాకపోవడం, మద్దతు ధర లేకపోవడంతో విసిగిపోయిన రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. కొందరు మిర్చి పంటకు బదులుగా పొగాకు సాగుచేస్తున్నారు. ఈ పంటకు తక్కువ నీరు, తెగుళ్ల బెడద లేకపోవడంతో సాగుకు చాలా మంది ముందుకు వస్తున్నారు. చెన్నూర్ మండలంలో గతేడాది కేవలం రెండెకరాల్లో పొగాకు సాగు కాగా, ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా సుమారు 20 ఎకరాల వరకు సాగు చేశారు. చెన్నూర్ మండలం అక్కెపల్లి, శివలింగాపూర్‌లో మాత్రమే సాగవుతుంది. మిర్చి, పత్తి పంట పెట్టుబడి తరహాలోనే పొగాకు పంటకు పెట్టుబడి అవుతుందని, లాభాలు మాత్రం ఎక్కువగా ఉంటున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

చీడ, పీడలు, తక్కువే..

పొగాకు పంటలో కలుపు, తెగుళ్ల బెడద ఉండదు. ఒక లద్దె పురుగు, తేనె మంచు మాత్రమే ఆశిస్తుంది. దీని నివారణకు లామ్డాసైహలోత్రిన్, ఇమిడాక్లోప్రిడ్ మందును ఎకరాకు 120 ఎంఎల్ పిచికారీ చేస్తే సరిపోతుంది. లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 60 ఎంఎల్ పిచికారీ చేయాలి. ఈ పంటకు కోతులు, అడవి పందులు, పశువుల బెడద ఉండదు.

ఆరబెట్టే విధానం..

పంట వేసిన ఐదు నెలలకు దిగుబడి చేతికి వస్తుంది. ఆకులను తెంపి సోలార్ కవర్ ఉన్నట్లయితే 8 నుంచి 10 రోజులు ఆరబెడితే సరిపోతుంది. లేదంటే తోరణాలుగా తయారు చేసి 20 రోజుల నుంచి 25 రోజులు ఆరబెట్టాలి. మార్కెట్‌కు తీసుకువెళ్లే సమయంలో బేల్లుగా తయారు చేసి తేమశాతం లేకుండా చూసుకోవాలి. క్వింటాల్ ధర రూ.15 వేల వరకు వస్తుంది. జనగామ జిల్లా ములకనూరులో పొగాకు మార్కెటింగ్ సౌకర్యం ఉన్నప్పటికి ఆశించిన స్థాయిలో మద్దతు ధర రాకపోవడంతో రైతులు ఆంధ్రకు వెళ్లాల్సి వస్తుంది. రైతులు ఒకే రకం పంట సాగు చేయకుండా ఇలా పంట మార్పిడి చేస్తే అధిక లాభాలు పొందవచ్చు.

సాగు విధానం

పొగాకు ఐదు నెలల పంట. ఆగస్టు, సెప్టెంబర్‌లో సాగుచేయాలి. ఇక్కడి రైతులకు నారు ఆలస్యంగా రావడంతో నవంబర్‌లో మొక్కలు పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కొత్తూరులోని జీపీఏ కంపెనీ వారు నారును అందించారు. ఒక్కో మొక్కకు రూ.1 చొప్పున పడుతుంది. ఎకరాకు 10 వేల మొక్కలు నాటుతారు. జీపీఏ కంపెనీ వారే పండిన పంటను కొనుగోలు చేస్తారు. ఇక్కడ సాగు చేసే పొగాకు రకం వైట్‌బెర్లీ రకం. ఎకరాకు రూ.70 వేలు ఖర్చవుతుంది. మొక్కలు నాటుపెట్టే సమయంలో ఆఖరి దుబ్బులో 15 కిలోల యూరియా, ఒక డీఏపీ 50 కిలోల బస్తా వేస్తారు. నాటుపెట్టి ఆకులు వచ్చే సమయంలో 50 కిలోల పొటాష్‌ని వేస్తారు. నీటితడులు మూడుసార్లు మాత్రమే అందిస్తారు. 25 రోజుల్లో అందించాల్సి ఉంటుంది. నాటు పెట్టిన 50 రోజుల్లో ఒక అమ్మోనియా వేస్తారు. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

రైతులు ముందుకు రావాలి



పంట మార్పిడిని అవలంబించేందుకు రైతులు ముందుకు రావాలి. అక్కెపల్లి, శివలింగాపూర్ గ్రామాల రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. ఈ పంటకు ఎలాంటి తెగుళ్లు ఆశించవు. పశువులు, అడవిపందులు, కోతుల బెడద ఉండదు. నీటి తడులు కూడా తక్కువగా ఉంటాయి. రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

– యామిని, ఏవో, చెన్నూర్

పంట మార్పిడి చేయాలి



ఎప్పటికీ ఒకే రకం పంటలు కాకుండా పంట మార్పిడి చేస్తే భూసారం దెబ్బతినకుండా ఉంటుంది. మా క్లస్టర్‌లో కొందరు రైతులు పొగాకు సాగు చేశారు. పంట దిగుబడి కూడా బాగానే వస్తుంది. రైతులు ఆలోచించాలి.

– రాజశేఖర్, ఏఈవో, అక్కెపల్లి, క్లస్టర్

ఆరెకరాల్లో సాగుచేశా



మిర్చి, పత్తి సాగు చేస్తే పురుగు, తెగుళ్లు ఆశిస్తే దిగుబడి రాక నష్టపోవాల్సి వస్తుంది. గతేడాది రెండెకరాల్లో పొగాకు సాగు చేశాను. మంచి లాభం వచ్చింది. ఈ ఏడాది ఆరు ఎకరాల్లో సాగు చేశాను.

– హన్మంతరావు, రైతు, శివలింగాపూర్

దిగుబడి చేతికి వస్తోంది



కొన్నేళ్లుగా పత్తి, మిర్చి, వరి సాగు చేస్తున్నాను. ఈ ఏడాది పంట మార్పిడి చేయాలని అనుకున్నా. మరో రైతును అడిగితే పొగాకు వేయాలని సూచించాడు. రెండెకరాల్లో సాగు చేశాను. పంట ఇప్పుడే చేతికి వస్తుంది.

– బజ్జూరి లచ్చన్న, రైతు, అక్కెపల్లి

తండ్రిపై దాడికి సుపారీ..

- స్నేహితుడికి రూ.50 వేలు ఇచ్చిన కొడుకు
- దాడిచేసి గొలుసు ఎత్తుకెళ్లిన దుండగులు
- 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్, ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తండ్రి, కొడుకు మధ్య కొన్ని రోజులుగా తలెత్తిన గొడవ చివరకు దాడి దారితీసింది. తండ్రి గొడవతో విసిగిపోయిన కొడుకు దాడి చేయించేందుకు స్నేహితుడికి సుపారీ ఇచ్చాడు. సుపారీ తీసుకున్న స్నేహితుడు దుండగులతో దాడి చేయించడంతోపాటు బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లిలో జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు 24 గంటల్లో కేసును ఛేదించారు. మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, హాజీపూర్ ఎస్సై సురేశ్ హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. వేంపల్లికి చెందిన నాగిరెడ్డి సత్యానందం-సరస్వతి దంపతులకు కొడుకు రమేశ్ ఉన్నాడు. దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని రోజులుగా తండ్రి, కొడుకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రమేశ్ తండ్రిపై దాడి చేయించేందుక అతని స్నేహితుడు సొల్లు అవినాశ్‌కు రూ.50 వేల సుపారీ ఇచ్చాడు. దీంతో అవినాష్ గర్మిళ్లకు చెందిన అందె అశోక్, అట్ల సంతోష్, ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మామిడిపల్లి చందు, చింతల కృష్ణతో కలిసి దాడికి ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సత్యానందర్ ఇంట్లో ఉండగా దాడి చేయించాడు. అంతేకాకుండా అతని మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. దీంతో బాధితుడు సాయంత్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు.

కొడుకుపై అనుమానంతో..

ఈ క్రమంలో కొడుకుపై అనుమానం రావడంతో అతడిని విచారణ చేశారు. దీంతో జరిగిన విషయం చెప్పాడు. దీంతో పోలీసులు అవినాశ్‌తోపాటు అశోక్, సంతోష్, చందు, కృష్ణను కూడా అదుపులోకి తీసుకున్నారు. 24 గంటల్లో దాడి కేసును ఛేదించారు. అయితే విచారణలో రమేశ్ చెప్పిన విషయాలు విని పోలీసులు షాక్‌కు గురయ్యారు. కేవలం కుటుంబ కలహాలతో కన్న తండ్రిపైనే దాడికి సుపారి ఇచ్చినట్లు రమేశ్ పోలీసులకు తెలిపాడు. నిందితుల నుంచి తులం బంగారు గొలుసు, సుపారీ కింద ఇచ్చిన రూ.30,670 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల్లో కేసు ఛేదించిన మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, హాజీపూర్ ఎస్సై సురేశ్, సీసీసీ ఎస్సై సుగుణాకర్, ఏఎస్సై ఎజాజ్, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, నరేందర్, ఎస్‌కే.పాషాను సీపీ అంబర్ కిశోర్ ఝూ, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ అభినందించారు.

మత్తడి ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్ట్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చాకేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గున్నికుంట చెరువు మత్తడి ధ్వంసం చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. ఈనెల 11న చాకేపల్లి గ్రామానికి చెందిన దుర్గం రాజయ్య గున్నికుంట చెరువు పక్కన ఉన్న తన చేనులో చెరువు భూమి కబ్జా చేసుకున్నాడు. తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌కు చెందిన జేసీబీ సహాయంతో తన భూమిలో తుమ్మ చెట్లను తొలగించాలని సూచించిన రాజయ్య అనంతరం గున్నికుంట చెరువు మత్తడి, తూము, కట్టను ధ్వంసం చేస్తే అధిక డబ్బులు ఇస్తానని చెప్పాడు. దీంతో విష్ణువర్ధన్ చెరువు మత్తడి, తూము, కట్టను ధ్వంసం చేసి ఆ మట్టిని చెరువులో వేసి చెరువు భూమిని రాజయ్య భూమిలో కలిపాడు. దీంతో చెరువు భూమి కబ్జాపై ఇరిగేషన్ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న ఇరిగేషన్ ఏఈఈ సునీత భూమి కబ్జా అయినట్లు గుర్తించి తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రమేశ్ నిందితులు దుర్గం రాజయ్య, విష్ణువర్ధన్‌ను శనివారం అదుపులోకి తీసుకుని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజపర్చామని సీఐ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్‌పై దాడి



శ్రీలతను పరామర్శిస్తున్న సీడీపీవో సరిత

కడెం: మండలంలోని లింగాపూర్ తండాకు చెందిన అంగన్‌వాడీ టీచర్ ధరంసోత్ శ్రీలతపై అదే తండాకు చెందిన సురేందర్, కమల, సరోజ దాడి చేశారు. శనివారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన సరుకులు తీసుకునేందుకు శ్రీలత వెళ్తుండగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన శ్రీలతను ఖానాపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ టీచర్ శ్రీలతను సీడీపీవో సరిత, సూపర్‌వైజర్లు పరామర్శించారు. హోలీ పండుగ రోజున జరిగిన గొడవ కారణంగానే అంగన్‌వాడీ టీచర్‌పై దాడి జరిగినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భుక్యా రమేశ్ డిమాండ్ చేశారు.

విద్యుత్ కంచెకు తగిలి రైతు దుర్మరణం

నర్సాపూర్ (జి): పంటను అడవి జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకున్న రైతుకు అదే కంచె మృత్యుపాశమై కాటేసిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంపూర్ అనుబంధ నసీరాబాద్ గ్రామానికి చెందిన బొందుగుల మల్లయ్య (54) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. తనకున్న రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. పంటను అడవి జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు చుట్టూ జీఐ వైర్ చుట్టి కరెంట్ కనెక్షన్ ఇస్తుండేవాడు. శుక్రవారం సాయంత్రం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం వరకు మల్లయ్య ఇంటికి రాకపోయేసరికి అతడి భార్య చిన్నక్క వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి చూడగా కరెంట్ షాక్ తగిలి మృతి చెంది ఉన్నాడు. చిన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి: మద్యం మత్తులో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బుర్సన్‌పటర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లే విద్యాసాగర్(57) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం హోలీ సంబరాల్లో భాగంగా అతిగా మద్యం తాగాడు. అదే మత్తులో సాయంత్రం చేనుకు వెళ్లి అక్కడ గుర్తు తెలియని పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించి 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై మరొకరు..

బజార్‌హత్నూర్: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రాంనగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై అప్పారావ్ తెలిపిన వివరాల ప్రకారం.. జాతర్ల గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్ గ్రామానికి చెందిన గొడం గంగారాం(54) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం తన పంట పొలంలోని చెట్టుకు తాడుతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ పంచాయతీ పరిధి మొర్రిగూడెం గ్రామానికి చెందిన ఆకుల సత్తెన్న (42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 20 ఏళ్ల క్రితం వివాహమైన సత్తెన్నకు సంతానం కలగకపోవడం, రెండేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మరణించడంతో మద్యానికి బానిసయ్యాడు. ఒంటరిజీవితం గడుపుతున్న అతడు మనస్తాపంతో గతంలో పలు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈక్రమంలో ఈనెల 14న మద్యం సేవించి బాత్‌రూంలో టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు ఆకుల శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామ శివారులోని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఖానాపూర్ సీఐ అజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏఎస్పీ రాజేశ్‌మీనా ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పోలీసులు పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. పేకాడుతున్న 18 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.10,1000 నగదు, 18 సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్రవాహనాలు, నాలుగు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాలకు చెందిన రాజకీయ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారులున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఉదయం స్థానిక సంజయ్‌నగర్ సమీపంలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న రేవంత్, నీలకంఠతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీనివాస్, ఆయన భార్యకు గాయాలయ్యాయి. సంజయ్‌నగర్ వైపు నుంచి బైక్‌పై వస్తున్న యువకులు ఎదురుగా ఆటోను ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108లో రిమ్స్‌కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నసీరాబాద్ గ్రామ శివారులో..

నర్సాపూర్ (జి): మండలంలోని నసీరాబాద్ గ్రామ శివారు 61వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలం ఎడ్డూర్ పొట్పెల్లి గ్రామానికి చెందిన గంజిగం కార్తిక్ ద్విచక్ర వాహనంపై నిర్మల్‌లో తన పని ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. చాక్‌పల్లి గ్రామానికి చెందిన షాదుల్లా టీవీఎస్ ఎక్సెల్‌పై నిర్మల్ వైపు అతివేగంగా వెళ్తూ నసీరాబాద్ గ్రామ శివారు 61 జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కార్తిక్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కార్తిక్ ఎడమకాలు విరిగిపోయింది. క్షతగాత్రుడిని గ్రామస్తులు 108 వాహనంలో నిర్మల్ ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. షాదుల్లాపై కేసు నమోదు చేయాలని కార్తిక్ తండ్రి సాయినాథ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.